## క్లుప్తంగా

### కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న నాయకులు

**హుజూరాబాద్:** పట్టణంలో మహిళా డప్పు కళాకారులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు డా. విష్ణుదాస్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. బొజ్జ లక్ష్మి, మరపల్లి విజయ, సరిత, ప్రవళిక, లాస్య, ఉర్మిళను అభినందించారు. ఇటీవల తమిళనాడులో జరిగిన కల్చరల్ ఫెస్టివెల్స్‌కు కట్కూరుకు చెందిన 15 మంది మహిళలు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో టీం లీడర్ అందసి నారాయణ, కన్వీనర్ రఫీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రుద్రారపు రాంచంద్రం, మారపల్లి శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**దళితరత్న అవార్డు గ్రహీతకు...**



సన్మానిస్తున్న బీసీ, గౌడసంఘం నాయకులు

**జమ్మికుంట** : మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన దళిత రత్న అవార్డు గ్రహీత బత్తుల పాండును బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి శంకర్, సర్వాయిపాపన్న మోకు దెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కే వీరస్వామిగౌడ్ ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న మోకుదెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్‌కుమార్‌గౌడ్, మండల కార్యదర్శి జక్కే రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేయొద్దు'

**తిమ్మాపూర్:** మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిరాధార ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఎల్‌ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గ ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌ఎల్ గౌడ్, మండల అధ్యక్షుడు బండారి రమేష్, జిల్లా నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, బీఆర్‌ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు.

### స్వేరో జెండావిష్కరణ

**సైదాపూర్:** మండలంలోని రాయికల్ జలపాతం వద్ద గుట్టల మైదానంలో విక్టరీ డే సందర్భంగా ఆదివారం స్వేరో జాతీయ జెండాను స్వేరో జిల్లా కోకన్వీనర్ ఎర్ర రాజు, సౌమ్యశ్రీ ఎగురవేశారు. మాలావత్ పూర్ణ ఎవరెస్టు శిఖరంపై స్వేరో జెండా విష్కరించి అంబేద్కర్ చిత్రపటాన్ని అక్కడ పెట్టారు. అందరూ చదవాలి, ఎదగాలనే లక్ష్యంతో స్వేరో పని చేస్తోందని ఎర్ర రాజు అన్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో 419 మార్కులు సాధించిన సౌమ్యశ్రీని స్వేరో సభ్యులు శాలువాతో సన్మానించారు.

### ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న స్నేహితులు

**హుజూరాబాద్:** మండలంలో తుమ్మనపల్లి పాఠశాల 1988 పదోతరగతి విద్యార్థులు తోటి విద్యార్థి నరసయ్యకు అప్పటి హెచ్‌ఎం ఎర్రం పాపిరెడ్డి చేతుల మీదుగా ఆదివారం రూ.26 వేలు అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతుండగా ఇటీవల జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో నరసయ్యకు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, లక్ష్మయ్య, సత్తయ్య, రమాదేవి, రత్నమాల, కొండాల్‌రెడ్డి, రామ్‌రెడ్డి, విమల రెడ్డి, అబ్దుల్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, లింగయ్య, స్వరూప పాల్గొన్నారు.

# ఆరువందల మీటర్లు.. అనేక గుంతలు



కోర్కల్ మలుపు వద్ద భారీ గుంత

**వీణవంక:** కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. మండలంలోని కోర్కల్-శ్రీరాములపేట గ్రామాల మధ్య రోడ్డు చిరుజల్లులకే గుంతలమయంగా మారింది. ఒక్కో గుంత మోకాలు లోతు ఉండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు వాపోతున్నారు. ఏడేళ్ల క్రితం వీణవంక-మానకొండూరు మధ్య ఫోర్‌లైన్ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.33కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుక్క కాంట్రాక్టర్ కోర్కల్ గ్రామంలో కంకరపోసి వదిలేశాడు. వర్షాలకు 600 మీటర్ల మేర రోడ్డుపై అనేక గుంతలు ఏర్పడటంతో కార్లు, ఆటోలు గుంతలో దిగబడుతున్నాయి. ఇసుక లారీల రవాణాతో గుంతలు మరింత లోతుగా ఏర్పడ్డాయి. రెండు రోజుల క్రితం కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో ఆటోలు జమ్మికుంటకు వెళ్తుండగా కోర్కల్ వద్ద గుంతలో పడిపోవడంతో గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# పేదల పక్షాన నిలబడేది సీపీఐ





మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

**ఇల్లందకుంట:** పేదల పక్షాన నిలబడేది సీపీఐ ఒక్కటేనని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఇల్లందకుంట మండల మహాసభ మల్యాల గ్రామంలో మాదారపు రత్నాకర్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ అంతరాలు లేని సమసమాజ స్థాపన కోసం పోరాటం చేస్తుందని, భూమి, ఇళ్లు, రేషన్‌కార్డులు,పెన్షన్లు, యువతకు ఉపాధి, హక్కుల సాధన, పేదపిల్లలకు ఉచిత విద్య, వైద్యం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదవాడి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పేదల కోసం పనిచేసే మావోయిస్టులను అంతంచేయడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. మావోయిస్టులు కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని చెప్పి లేఖలు రాస్తున్నా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పంజాల శ్రీనివాస్, ఇజ్జగిరి రాంగోపాల్, బుర్ర సతీష్ లు పాల్గొన్నారు.

# అదును దాటిపోతున్నా విత్తనాలు రాలే

**వీణవంక:** పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసే సమయం దాటిపోతున్నా ఇంతవరకు మండలానికి సరఫరా చేయలేదని బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గొట్టిముక్కుల సంపత్‌రావు అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో ఆదివారం మాట్లాడారు. మే 15నుంచే విత్తుకోవాల్సి ఉండగా రోహిణి కార్తె ప్రవేశించిన ఇంతవరకు ఎందుకు విత్తనాలు తెప్పించలేదని మండిపడ్డారు. గతంలో కంటే విత్తనాల రేట్లు అధికంగా పెంచారని, రైతులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి పచ్చిరొట్ట విత్తనాలు మండలానికి సరఫరా చేయించాలని కోరారు.

**అధికారులు విఫలం**

**ఇల్లందకుంట:** జిల్లా రైతులకు జీలుగ, పెసర, పచ్చిరొట్ట విత్తనాలు వెంటనే సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము అన్నారు. ఆదివారం ఇల్లందకుంటలో మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ఖరీఫ్‌లో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అత్యధికంగా వరి సాగు చేస్తున్నారని, ఎరువు విత్తనాలు సబ్సిడీపై కొనుగోలు చేయడానికి మే నెల రైతులకు సరైన సమయమని, ఈ సంవత్సరం రుతుపవనాలు ముందుగా వచ్చాయని వాతావరణశాఖ పలు మార్లు సూచించినప్పటికీ విత్తనాలను సరఫరా చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి విత్తనాలను సత్వరమే సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

### అందుబాటులో విత్తనాలు

**చిగురుమామిడి:** మండలంలోని ఆయా గ్రామాల రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 50 శాతం సబ్సిడీతో తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజులునాయుడు ఆదివారం ప్రకటనలో కోరారు. మండలానికి 125 క్వింటాళ్లు వచ్చినట్లు పీఏసీఎస్ చిగురుమామిడి, డీసీఎంఎస్ చిగురుమామిడి, డీసీఎంఎస్ సుందరగిరిలో అందుబాటులో ఉన్నాయని, పంటపొలాల్లో జల్లితే మంచి దిగుబడి వస్తుందన్నారు.

### నేటి నుంచి పచ్చిరొట్ట పంపిణీ

**చొప్పదండి:** పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా సోమవారం నుంచి జీలుగ విత్తనాలను పంపిణీ చేయనున్నామని ఏవో వంశీకృష్ణ తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్‌తో రైతులు ఉదయం ఎనిమిది గంటల నుంచి సొసైటీలో సంప్రదించాలని కోరారు. 30 కేజీల బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని, ధర రూ.2,317గా నిర్ణయించామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న కొప్పుల శంకర్, నాయకులు

**జమ్మికుంట:** కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. పట్టణంలో ఆదివారం పంచాయతీ ఎంప్లాయీస్, అండ్ వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాల దయతో ఏనాడు కార్మిక సమస్యలు పరిష్కారం కాలేదని, 2023లో 33 రోజుల సమ్మె ఫలితంగా కార్మికులకు రూ.8,500 జీతం వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు పారిశుద్య కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొత్తూరు మల్లయ్య, రవీందర్‌రావు, వడ్లూరి లక్ష్మీనారాయణ, లద్దునూరి కుమార్, మెలుగూరి ప్రేమ్‌కుమార్, బండి సమ్మయ్య, బొబ్బిలి రమేశ్, రాములు, భద్రయ్య, రవి, తిరుపతి పాల్గొన్నారు.

# మన్‌కీ బాత్ వీక్షించిన నాయకులు

**శంకరపట్నం:** మండలంలోని కొత్తగట్టు గ్రామంలో ఆదివారం 85వ పోలింగ్ బూత్‌లో బీజేపీ శ్రేణులతో కలిసి ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వీక్షించారు. సంగారెడ్డి జిల్లా మహిళా రైతుల గురించి మోదీ ప్రస్తావించారని, వ్యవసాయంలో మహిళ రైతులు డ్రోన్లను సమర్థవంతంగా వినియోగించడంపై ప్రశంసించారు. జూన్‌లో యోగా దివాస్ ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యంసాహసం అపారమన్నారు.

**జమ్మికుంట:** పట్టణంలోని 190వ బూత్‌లో నాయకులు మన్‌కీ బాత్‌కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం మాట్లాడారు. ఉగ్రదాడి తర్వాత దేశ ప్రజల ఏకతాటిపైకి వచ్చారని పేర్కొన్నారు.

**హుజూరాబాద్:** పట్టణంలో పలు బూత్‌ల్లో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రపంచం మొత్తం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి ప్రోత్సా హం ఇచ్చిందన్నారు.

### మున్నూరుకాపు వన్నారం గ్రామ కమిటీ



నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

**రామడుగు:** మండలంలోని వన్నారం గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని ఆదివారం సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరాల రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా వరాల అనిల్, వరాల కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా గర్షూరి చిన్న శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా వరాల శ్రీకాంత్, నల్లెల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా వరాల తిరుపతి, రెండ్ల మల్లేశం, రెండ్ల హరీష్, రానూరి నర్సింగం, కోడారి నవీన్, శ్రీరామ్ నాగరాజు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులను శాలువాలు కప్పి సన్మానించారు.

### ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

**చిగురుమామిడి:** మండలంలోని నవాబుపేట గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా వరుకోలు రవి, ఉపాధ్యక్షుడిగా ఠాకూర్ ధర్మేందర్ సింగ్, కార్యదర్శిగా పొలవేని సంపత్, సహాయ కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా గూల్ల సమ్మయ్య, సలహాదారుడిగా పొలవేని సాయికృష్ణ మరో నలుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు పనిచేస్తుందని అధ్యక్షుడు రవి తెలిపారు. ట్రాక్టర్ ఓనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

### నేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

**చొప్పదండి:** పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేస్తారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీవో వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని లబ్ధిదారులు సకాలంలో ఫంక్షన్ హాల్‌కు చేరుకొని ప్రొసీడింగ్‌లు తీసుకోవాలని కోరారు.

### గ్రామాభివృద్ధికి కృషిచేస్తా

**చిగురుమామిడి:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో మండలంలోని బొమ్మనపల్లి గ్రామ అభివృద్ధికి కృషిచేస్తానని రిటైర్డ్ ఉపాధ్యాయుడు బడుకోలు దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చిగురుమామిడిలో మాట్లాడారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన తర్వాత మంత్రి సమక్షంలో మద్దతుదారులతో కలిసి కాంగ్రెస్‌లో చేరానన్నారు.

### యూనిఫాం అందజేత

**కరీంనగర్‌రూరల్:** కరీంనగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నగునూరు కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న హమాలీలకు డైరెక్టర్ సాయిల్ల మహేందర్ ఆదివారం యూనిఫామ్స్ అందజేశారు. ధాన్యాన్ని సేకరించడంలో హమాలీల పాత్ర కీలకమన్నారు. సంఘం అధ్యక్షుడు రాజేశం, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కోశాధికారి రవీందర్‌తో పాటు పలువురు హమాలీలు పాల్గొన్నారు.



**ఇల్లందకుంట:** ఇటీవల కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని మూడో వార్డులోని పాఠశాలకు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తేలికపాటి వర్షానికే గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలుస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలబారినపడుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. వర్షాకాలంలో దారి చెరువును తలపిస్తోందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వర్షం నీరు రోడ్డుపై నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
పుల్లయ్య, ఎంపీడీవో సెల్ నం : 92814 82640

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



గన్నేరువరం: మైలారంలో నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

# పోచమ్మ బోనాలు

**గన్నేరువరం:** మండలంలోని మైలారం గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, తదితరలు పాల్గొన్నారు.

**సీతారామ ఆలయంలో కలశ పూజ**



చొప్పదండి: కలశ పూజ చేస్తున్న భక్తులు

**చొప్పదండి:** మండలంలోని గుమ్లాపూర్ గ్రామం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం మండల కలశ పూజ నిర్వహించారు. అర్చకులు రంగాచారి, రత్నాకర్‌ల ఆధ్వర్యంలో హోమం, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. 101 కలశాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముష్కె వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 1.12 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

**సైదాపూర్:** యాసంగిలో వెన్కెపల్లి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలోని 14 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.12 లక్షల క్వింటాళ్ల ధాన్యంసేకరించామని సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. యాసంగిలో రైతులకు సాగునీటి ఇబ్బందులు రావొద్దని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ రూ.15 లక్షల నిధులతో కెనాల్ పూడిక, మరమ్మతు పనులు చేయించారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. 1949 మంది రైతుల ద్వారా ధాన్యం సేకరించి, రూ. 26.44 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ చొప్పున రూ.27.83 లక్షలు ప్రభుత్వం చెల్లించిందన్నారు. తూకం, ధాన్యం తరలింపులో సహకరించిన హమాలీ, లారీ యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

# గుండెపోటుతో యువకుడు మృతి

**హుజూరాబాద్:** ఇటీవల హనుమాన్ మాల ధరించి ఎంతో నిష్టగా ఉన్న ఆ యువకుడు మాల తీసిన మరుక్షణమే ఒక్కసారిగా అనారోగ్యానికి గురై గుండెపోటుతో మృతిచెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ సభ్యులు వివరాలు ప్రకారం.. సింగపూర్ గ్రామానికి చెందిన నీరటి శ్రీనివాస్-స్వరూప దంపతులు మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ ఐబీపీ పెట్రోల్ పంపు వెనక వైపు ఇల్లు కొనుగోలు చేసి కుటుంబంతో సహా ఇక్కడే కొన్నాళ్లుగా ఉంటున్నారు. వారి పెద్ద కుమారుడు నీరటి శశేశ్వర్(32) బీటెక్ పూర్తి చేసి కొన్నాళ్ల క్రితం ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేసి మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇటీవల 21 రోజులుగా హనుమాన్ మాల ధరించి భక్తితో ఉపవాసాలు ఉంటూ భగవంతున్ని కొలిచాడు. ఉపవాసాలతో పూర్తిగా నీరసించి ఆరోగ్యం క్షీణించడంతో మాల తీసిన రోజే శనివారం ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయాడు. ఆస్పత్రిలో చూపించగా.. మాత్రలు రాసి పంపించారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో సొమ్మసిల్లి పడిపోగా.. 108 వాహనానికి సమాచారమిచ్చారు. వారు వచ్చి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్థానికులు మృతదేహాన్ని సందర్శించారు. అయితే శశేశ్వర్‌ను ఆయన పెద్దనాన్న నీరటి బాబు కొన్నాళ్లు పెంచి పెద్ద చేయగా.. కొన్నాళ్ల క్రితమే సొంత తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటున్నాడు.

# ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

**మానకొండూర్:** గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన పప్పు ఆంజనేయులు(23) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఆంజనేయులు కరీంనగర్‌లోని బాటిలింగ్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి అతడు వెళ్లగా.. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెతకగా.. గ్రామ సమీపంలోని గుట్ట వద్ద ఉరేసుకొని కనిపించాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సైదాపూర్: వెన్కెపల్లి హైస్కూల్ 2006-07 పదో తరగతి విద్యార్థులు



చిగురుమామిడి: ఇందుర్తిలో 1999-2000 పదో తరగతి విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

**చిగురుమామిడి:** మండలంలోని ఇందుర్తి జెడ్పీహెచ్‌ఎస్ 1999-2000 పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన టీచర్లను ఘనంగా సన్మానించారు. రోజంతా ఆడుతూ పాడుతూ గడిపారు. పాఠశాల తరగతి గదులు, ఆవరణ పరిశీలిస్తూ జ్ఞానపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు గుడికందుల సంపత్, ఆదెపు ఆంజనేయులు, తోట సతీష్, దుస్స లక్ష్మణ్, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, చింతపూల సంపత్, బొమ్మగాని రాజశేఖర్, బందెల శ్రీనివాస్, అప్పాల వెంకటయ్య పాల్గొన్నారు.

**శంకరపట్నం** మండలంలోని తాడికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 పదో తరగతి విద్యార్థులు వంకాయగూడెం గ్రామంలోని ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

**సైదాపూర్:** వెన్కెపల్లి ఉన్నత పాఠశాల 2006-07 పదోతరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



శంకరపట్నం: చదువు చెప్పిన ఉపాధ్యాయులతో తాడికల్ 1992-93 పదో తరగతి విద్యార్థులు